సాక్షి మహబూబ్‌నగర్
సోమవారం । 1 । జూలై । 2024



జగజ్జేతకు జయహో..
టీ20 ప్రపంచ కప్ విజేతగా టీమిండియా నిలవడంతో జిల్లాలో సంబరాలు మిన్నంటాయి.
వివరాలు 8లో ▸



ఆది నుంచి వివాదాస్పదమే!
జడ్చర్ల పురపాలక సంఘం ఆది నుంచి వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
28.4 /23.1
వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రివేళల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అలరించిన సంకీర్తన గానకచేరి



స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీఅన్నమయ్యవాణి లలితా సంగీత విద్యాలయం వ్యవస్థాపకుడు గద్వాల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న శ్రీవనమాలి పాదపద కవితా సంకీర్తన చతుర్థ వారోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గద్వాల చంద్రశేఖరరావు నిర్వహించిన అన్నమయ్య సంకీర్తన గానకచేరి అందరినీ అలరించింది. సంకీర్తన వారోత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సామవేదం వెంకట మురళీకృష్ణ, డా.ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం.. ఆహ్లాదకరం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆటలతో ఆరోగ్యంతో పాటు ఆహ్లాదకరమైన స్నేహాన్ని పొందవచ్చని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా ప్రధాన స్టేడియంలో స్థానిక మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎలెవన్, కమిషనర్ ఎలెవన్ జట్ల మధ్య స్నేహపూర్వక క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడూ విధుల్లో నిమగ్నమయ్యే ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల్లో ఇలాంటి పోటీలతో ఉల్లాసం, ఉత్సాహం పెరుగుతుందన్నారు. ఇది తమ జీవితాల్లో తీపి గుర్తుగా మిగిలి పోతుందన్నారు. కాగా, ఈ పోటీల్లో ఎమ్మెల్యే ఎలెవన్ జట్టు 93 పరుగులు చేసి విజయం సాధించింది. అలాగే కమిషనర్ ఎలెవన్ జట్టు 86 పరుగులతో రన్నర్‌గా నిలిచింది. బెస్ట్ బ్యాట్‌మన్‌గా డి.మహేశ్వర్ రెడ్డి (మున్సిపల్ కమిషనర్) ని, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా పాపారాయుడు (17వ వార్డు ప్రతినిధి) ను అంపైర్‌గా వ్యవహరించిన 30వ వార్డు కౌన్సిలర్ చెన్న వీరయ్య ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, ఆర్‌ఓ మహమ్మద్ ఖాజా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డితో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంతో పాటు భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట, జడ్చర్ల, హన్వాడ, మహబూబ్‌నగర్ రూరల్ తదితర మండలాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో స్థానికులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓపెన్ నాలాలు, వీధుల్లోని మోరీలలో చెత్తాచెదారం వచ్చి చేరింది. వరుసగా నాలుగు రోజులుగా వర్షం కురుస్తుండటంతో వాతావరణం చల్లబడింది. ఇక మినీ ట్యాంక్‌బండ్ (పెద్ద చెరువు)లోకి రెండు వైపులా ఏర్పాటుచేసిన తూముల ద్వారా వరద చేరుతోంది. కాగా, ఇనుప జాలీల వద్ద పేరుకుపోతున్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు.

కోయిల్‌సాగర్‌లో పెరుగుతున్న నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఉంద్యాల ఫేస్–1 పంప్‌హౌస్ నుంచి ఒక మోటారు ద్వారా తీలేర్ వద్దనున్న ఫేస్–2కు నీటి పంపింగ్ కొనసాగుతోంది. అక్కడి నుంచి కోయిల్‌సాగర్‌కు ఒక పంపు ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 15.6 అడుగులకు చేరింది. రెండు వారాల క్రితం వరకు కేవలం 10.6 అడుగులు ఉన్న నీటిమట్టం.. ప్రస్తుతం 5 అడుగుల మేర పెరిగింది. వర్షాలు సమృద్ధిగా కురిసి పెద్ద వాగు ప్రవహిస్తే, ప్రాజెక్టులోకి వరద పెరుగుతుంది. మరో 10 అడుగుల నీటిమట్టం పెరిగితే, వానాకాలం పంటలకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. గడిచిన రెండేళ్లలో జూలై చివరి వారంలోనే పంటలకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు అలుగుస్థాయి నీటిమట్టం 26.6 అడుగులు కాగా.. గేట్ల స్థాయి నీటిమట్టం 32.6 అడుగులుగా ఉంది. అలుగు స్థాయికి చేరాలంటే మరో 11 అడుగుల నీరు అవసరం. గేట్ల స్థాయికి చేరాలంటే మరో 17 అడుగుల నీరు చేరాల్సి ఉంటుంది.

ప్రాణదాతలుగా నిలుస్తూ.. పునర్జన్మనిస్తూ..

రోగుల సేవలో తరిస్తున్న వైద్యులు
- ఆపద కాలంలో రోగుల పాలిట ఆపద్బాంధవులు
- ప్రభుత్వ రంగంలో మెరుగైన వైద్యసేవల్లో ముందడుగు



పాలమూరు: ప్రాణం పోసేది బ్రహ్మ అయితే పునర్జన్మ ఇచ్చేది వైద్యుడు. అందుకే వైద్యో నారాయణో హరి అని అన్నారు పెద్దలు. ప్రతి ఒక్కరూ వైద్యుడిలో దేవుడిని చూస్తారు. ఎంత గొప్ప వ్యక్తి అయినా.. పేదవాళ్లు అయినా చేతులెత్తి నమస్కరించేది వైద్యులకు మాత్రమే. ప్రాణపాయ స్థితిలో ఉన్నా.. ప్రమాదంలో గాయపడినా.. ఎలాంటి ఆపద వచ్చినా గుర్తుకు వచ్చేది వైద్యులే. వారి ఆత్మీయ స్పర్శ రోగికి అపర సంజీవని. ప్రస్తుత పరిస్థితులలో ఆహారం, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా కొత్త కొత్త రోగాలు వస్తున్నాయి. రోజూ వేల మంది రోగులకు వైద్యులు వివిధ రకాల చికిత్సలు అందిస్తున్నారు. రోగుల ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నారు. ఎంతో మంది వైద్యులు మానవత్వంతో అభ్యాగులకు సేవలందిస్తూ.. అందరి మన్ననలు పొందుతున్నారు. సోమవారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల 2016లో ప్రారంభం కాగా.. ఇప్పటి వరకు 450 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్నారు. 2016లో 150 మంది, 2017లో 150, 2018లో 150 మంది వైద్యవిద్య అభ్యసించారు. ప్రస్తుతం 2019 బ్యాచ్‌లో 175 మంది హౌజ్ సర్జన్లుగా జిల్లా జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. ఇక 2020 బ్యాచ్‌లో 175 మంది, 2021లో 175 మంది, 2022లో 175 మంది, 2023లో 175 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు మెడికల్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 875 మంది విద్యార్థులు భవిష్యత్‌లో వైద్యులుగా సేవలు అందించనున్నారు.

22 ఏళ్ల అనుభవం..



ఉస్మానియా యూనివర్సిటీలో 1992 నుంచి 1996 వరకు ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత గాంధీలో 2002లో జనరల్ సర్జరీ విభాగంలో ఎంఎస్ పూర్తిచేశా. అనంతరం మూడేళ్లపాటు యూకేలో శిక్షణ పూర్తి చేసుకొని కర్నూలు, ఉస్మానియా ఆస్పత్రిలో విధులు నిర్వహించాను. గతేడాది నుంచి జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాను. ఈ 22 ఏళ్ల అనుభవంలో ఎంతో మందికి సేవలు అందించా. పేదలకు సేవ చేయడం గొప్పగా భావిస్తున్నా. ప్రతి ఒక్కరికీ సహనంతో పరీక్షించడంతో పాటు అర్థమయ్యే విధంగా చెప్పడం అలవాటు చేసుకున్నాను.

– డాక్టర్ జీవన్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

కరోనా సమయంలో ఇంటింటికెళ్లి చికిత్స..



కరోనా సమయంలో ఇంటింటికి తిరిగి చికిత్స అందించడం, ప్రతి ఒక్కరికి ధైర్యం కల్పించడం నా జీవితంలో మరిచిపోలేను. కరోనా పాజిటివ్ వచ్చిన వారి వద్దకు వెళ్లి భరోసా ఇవ్వడంతో పాటు వారికి కావాల్సిన మందులు, సూచనలు ఇచ్చాను. నేను 2014లో కర్నూలులో ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత 2017లో సర్వీస్‌లోకి వచ్చాను. మొదట మిడ్జిల్‌లో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరాను. గతేడాది పీహెచ్‌సీని జాతీయ నాణ్యతా ప్రమాణాల కమిటీ ఎంపిక చేయడం కోసం కృషి చేశాను. దీంతో సర్వీస్ అప్‌గ్రేడ్ కావడం, నిధులు రావడం జరుగుతుంది.

– డాక్టర్ శివకాంత్, మెడికల్ ఆఫీసర్, మిడ్జిల్

ఎన్నో సర్జరీలు చేశాను..



ఉస్మానియా యూనివర్సిటీలో 1987 లో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత 1992 వరకు గాంధీలో ఎంఎస్ జనరల్ సర్జరీ పూర్తిచేయగా.. అదే ఏడాది జహీరాబాద్ సమీపంలోని కోహీర్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. 1996 వరకు అక్కడ పనిచేసి, ఎన్నో సర్జరీలు చేశాను. ఉత్తమ వైద్యుడిగా అవార్డు అందుకున్నా. 1996 నుంచి 2006 వరకు ఉస్మానియాలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన సమయంలో ఎన్నో హైరిస్క్ సర్జరీలు చేసి, ప్రాణాలు కాపాడిన సందర్భాలు ఉన్నాయి. 2006 నుంచి 2008 వరకు కర్నూలు మెడికల్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2009 నుంచి 2012 వరకు గాంధీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ఆ తర్వాత 2012 నుంచి 2021 వరకు ఉస్మానియాలో ప్రొఫెసర్‌గా, జనరల్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీగా పనిచేశాను. ఆ తర్వాత ఏడీఎంఈగా పదోన్నతి లభించి, మహబూబ్‌నగర్‌కు వచ్చాను.

– డాక్టర్ రమేష్, మెడికల్ కళాశాల డైరెక్టర్, మహబూబ్‌నగర్

బస్సులో డెలివరీ చేయడం మరిచిపోలేను..



2010లో ఎంబీబీఎస్ పూర్తిచేయగా.. 2011 నుంచి నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో పనిచేశాను. హన్వాడలో ఏడాది పాటు పని చేసిన తర్వాత జానంపేట పీహెచ్‌సీకి వెళ్లాను. 2014లో పోస్టింగ్ రెగ్యులర్ కావడం జరిగింది. జానంపేట నుంచి ఓ రోజు మహబూబ్‌నగర్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్తుంటే.. ఓ గర్భిణి కొత్తకోట నుంచి రెఫర్ మీద ప్రసవం కోసం జిల్లా ఆస్పత్రికి వస్తుంది. ఈ క్రమంలో మార్గంమధ్యలో ఆమెకు నొప్పులు రావడంతో బస్సులోనే నేను డెలివరీ చేశాను. ఆ ఘటనను నా జీవితంలో మరిచిపోలేను. తల్లీబిడ్డలను పీహెచ్‌సీకి తీసుకెళ్లి, చికిత్స అందించి కావాల్సిన బెనిఫిట్స్ అందించాం. జాతీయస్థాయిలో ఒకసారి, రాష్ట్ర స్థాయిలో రెండు సార్లు అవార్డులు తీసుకున్నాను.

– డాక్టర్ శ్వేతారెడ్డి

ఏడాదిన్నరలో 435 సాధారణ కాన్పులు..



ఏడాదిన్నర కాలంలో దేవరకద్ర పీహెచ్‌సీలో 435 సాధారణ కాన్పులు చేశాం. సాధారణ ఓపీతో పాటు ప్రసవాలపై ఎక్కువ దృష్టి సారించాను. పీహెచ్‌సీల వారీగా పరిశీలిస్తే.. జిల్లాలో అత్యధిక కాన్పులు ఇక్కడే అవుతాయి. దీంట్లో కొంత వరకు హైరిస్క్ ఉన్న కేసులు సైతం బాధ్యతగా తీసుకుని ప్రసవాలు చేయడం జరిగింది. నేను 2015లో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత లట్టుపల్లి, బిజినేపల్లి, కోయిలకొండ సివిల్ ఆస్పత్రి, మహబూబ్‌నగర్, ప్రస్తుతం దేవరకద్రలో పనిచేస్తున్నాను. 24 గంటల్లో ఎప్పుడూ డెలవరీ కోసం వచ్చినా నాతో పాటు సిబ్బంది సిద్ధంగా ఉంటారు. ఈ ఏడాది జనవరి 26న ఉత్తమ వైద్యుడిగా ప్రశంసపత్రం అందుకున్నా.

– డాక్టర్ శరత్‌చంద్ర, పీహెచ్‌సీ, దేవరకద్ర

గిరిజన ప్రాంతాల్లో సేవలు..



కొల్లాపూర్ గిరిజన ఏరియాలో విధులు నిర్వహించే క్రమంలో ప్రయాణానికి నిత్యం ఇబ్బందులు పడేవాళ్లం. పది నెలలపాటు ఆ ఏరియాలో ఉన్న ప్రతి గ్రామాన్ని సందర్శించాం. డెంగీ కేసులు అధికంగా వచ్చిన సందర్భంగా ఒక అమ్మాయికి పరిస్థితి ఇబ్బందిగా ఉంటే, మెరుగైన చికిత్స అందించడంతో పాటు ఇంటికి వెళ్లి పర్యవేక్షించాను. నేను 2015లో కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత జనరల్ ఆస్పత్రిలో ఎస్‌ఆర్‌సీలో రెండు ఏళ్లపాటు పనిచేశాను. హైదరాబాద్ బస్తీ దవాఖానలో, కొల్లాపూర్‌లో పనిచేశాను. గతేడాది జనవరి 1నుంచి జనరల్ ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ క్యాడర్‌లో ఆర్‌ఎంఓగా పనిచేస్తున్నాను. రాబోయే రోజుల్లో గైనిక్ పూర్తిచేసి, మంచి గైనకాలజిస్టుగా గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది.

– డాక్టర్ శిరీష, ఆర్‌ఎంఓ, జనరల్ ఆస్పత్రి

ప్రీ స్కూల్‌గా అంగన్‌వాడీలు



మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ధర్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న టీచర్ (ఫైల్)

- పూర్వ ప్రాథమిక విద్య బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు
- విడతల వారీగా టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు
- చిన్నారులకు ఉచిత పుస్తకాలు, యూనిఫాంల సరఫరా
- జిల్లావ్యాప్తంగా 1,184 కేంద్రాలు.. 1,148 మంది టీచర్లు
- మహిళా, శిశు సంక్షేమ శాఖకే నిర్వహణ బాధ్యత

జిల్లా పరిధిలో ఇలా..

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు : 4	అంగన్‌వాడీ ప్రధాన కేంద్రాలు : 1,081	
మినీ కేంద్రాలు 103	గర్భిణులు 5,935	బాలింతలు 5,648
7 నెలల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు	51,522	

మహబూబ్‌నగర్ రూరల్: పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. అందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలు (ప్రీ స్కూల్స్‌గా) తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయనుంది. ఇక నుంచి ఆయా కేంద్రాల్లో కొనసాగనున్న ఆంగ్ల మాధ్యమం బోధనకు సంబంధించి జిల్లా నుంచి 11 మంది సూపర్‌వైజర్లకు విద్యా బోధనపై హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. మాస్టర్ ట్రైనర్లు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ఐసీడీఎస్ ప్రాజెక్టు సెక్టార్ల వారీగా శిక్షణ ఇస్తున్నారు. పిల్లల్లో క్రమశిక్షణతో పాటు తారతమ్యం లేకుండా యూనిఫాం అమలు చేయనుంది. కాగా.. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోనే ప్రీ స్కూల్స్ నిర్వహణ చేపట్టనున్నారు.

విద్యాబోధనలో మార్పులు..
అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం అందించి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో విద్యా బోధన చేపడుతున్నారు. అయితే ప్రీ స్కూల్‌లో మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలుగా ప్రేరణాత్మక, కృత్యాధార బోధన ఉంటుందని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. జూన్ నుంచి ఆగస్టు వరకు ఆటపాటలు, ప్రకృతి, సైన్స్, యోగా, పూర్వ గణితం, రంగులు ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కార్యక్రమాలతో పాటు కృత్యాలతో పిల్లలకు విద్యా బోధన చేస్తారు. ప్రతి నెల 4వ శనివారం పూర్వ ప్రాథమిక విద్యా దినోత్సవం జరిపి కృత్యాలు, కార్యక్రమాలను ప్రదర్శిస్తారు. పిల్లల్లో వచ్చిన మార్పులు, అభివృద్ధిని తల్లిదండ్రులకు తెలియజేస్తారు.

నేటి నుంచి ప్రారంభం..
ప్రీ స్కూల్‌కు ఎంపికైన కేంద్రాలకు సరఫరా చేసిన పుస్తకాల సిలబస్‌లో కూడా కొంత మార్పు ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రీ స్కూల్ చదివే పిల్లలకు ప్రభుత్వమే ఉచితంగా యూనిఫాం అందించనుంది. సోమవారం నుంచి ప్రీ ప్రైమరీ విద్యను ప్రారంభించి, చిన్నారులకు ఉచిత పుస్తకాలు, యూనిఫాం కూడా పంపిణీ చేయనున్నారు.

ప్రీ ప్రైమరీ విద్యపై శిక్షణ

మాస్టర్ ట్రైనర్లు అయిన సూపర్‌వైజర్ల ద్వారా అంగన్‌వాడీ టీచర్లకు ప్రీ ప్రైమరీ విద్యపై ప్రాజెక్టుల వారీగా శిక్షణ ప్రారంభించాం. పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం ప్రీ స్కూళ్లను ఏర్పాటు చేస్తుంది. సంబంధిత మెటీరియల్, కిట్స్, పుస్తకాలు, యూనిఫాం త్వరలోనే కేంద్రాలకు సరఫరా అవుతాయి.

– జరీనాబేగం, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి

శిక్షణ షెడ్యూల్ ఇలా..

జిల్లాలో ప్రీస్కూల్ నిర్వహణ, విద్యా బోధనపై మే నెలలోనే సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. మాస్టర్ ట్రైనర్లు అయిన పదిమంది సూపర్‌వైజర్లు ఒక్కో బ్యాచ్‌లో 35 మంది అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. టీచర్లు శిక్షణను పూర్తి చేసుకున్న అనంతరం ప్రీ స్కూల్స్ నిర్వహణను లక్ష్యం మేరకు చేపట్టడానికి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు సమాయత్తం అవుతున్నారు.

27న ఎన్టీఆర్ కళాశాలలో జాతీయ సదస్సు



సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జూలై 27న గణితశాస్త్రం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ మ్యాథమెటికల్ ఎడ్యుకేషన్ పెడగాజికల్ ఇన్నోవేషన్' అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణితశాస్త్రంలో. ఆధునిక పోకడలు, డిజిటల్ టూల్స్ వినియోగం తదితర అంశాలపై నిర్వహించే సదస్సు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న సదస్సు అన్ని రకాల సబ్జెక్టులకు అనుసంధానంగా ఉంటుందని అన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 17వ తేదీలోగా తమ అబ్‌స్ట్రాక్స్ సమర్పించాలని సూచించారు. విద్యా విధానంపై పరిశోధన పత్రాలను ప్రజెంటేషన్ ఇచ్చే వారికి ఇదో చక్కటి అవకాశం అని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, విజయలక్ష్మి, రాజేశ్వరి, రవలి, గంగాధర్, కేశవర్ధన్, రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



అవార్డులు అందుకున్న విద్యార్థులతో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉన్నత చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గౌడ ఉద్యోగుల సంఘం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్యడైజ్ హాల్‌లో పదో తరగతి, ఇంటర్, ఐఐటీ, నీట్‌లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలని కోరారు. కష్టపడి చదివే విద్యార్థులను ప్రోత్సహిస్తే మరిన్ని అద్భుతాలు సాధిస్తారని అన్నారు. భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించి, తమ జాతి మేలుకోసం కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పదోన్నతులు పొందిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, గ్రేట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, సాయిలుగౌడ్, రాష్ట్ర గౌడ హాస్టల్ అధ్యక్షుడు చక్రవర్తిగౌడ్, పురుషోత్తంగౌడ్, శ్రీధర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, వెంకటయ్యగౌడ్, మధుబాబు పాల్గొన్నారు.

నల్లమలలో విహారానికి విరామం..

ఫర్హాబాద్ సఫారీ తాత్కాలికంగా నిలిపివేత
- నేటి నుంచి సెప్టెంబర్ 30 వరకు నిషేధాజ్ఞలు
- జంతువుల సంతానోత్పత్తి సమయం కావడంతో ఏటీఆర్‌లో కఠిన నిబంధనలు



అచ్చంపేట: వానాకాలం ప్రారంభంతో అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం (ఏటీఆర్)లోకి ఎవరూ ప్రవేశించకుండా నిబంధనలను కఠినత్వం చేశారు. జంతువుల సంతానోత్పత్తికి అనువైన సమయం కావడంతో సోమవారం నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు మూడు నెలల పాటు ఫర్హాబాద్ సఫారీకి విరామం ప్రకటించారు. జంతువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గాను పర్యాటకుల సందర్శనను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో నల్లమలలోని ఫర్హాబాద్, వ్యూపాయింట్, చెంచుపెంటలను పర్యటించే అవకాశం ఉండదు. తిరిగి అక్టోబర్ 1వ తేదీ నుంచి సఫారీ టూర్ ప్రారంభం కానుంది.

అతిపెద్ద టైగర్ రిజర్వు..
దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్టుగా అమ్రాబాద్ అభయారణ్యం గుర్తింపు పొందింది. నల్లమల 2,611.39 చదరపు కి.మీ. విస్తీర్ణంలో విస్తరించి ఉంది. అందులో 2,166.37 చదరపు కి.మీ. అభయారణ్యం కాగా.. 445.02 చదరపు కి.మీ. బఫర్ జోన్‌గా ఉంది. అటవీశాఖ లెక్కల ప్రకారం నల్లమలలో 30 పెద్దపులులు, 6 పిల్లలు, 165 చిరుతలు, 2,500 పైగా ఎలుగుబంట్లు, జింకలు, దుప్పులు ఇతర జంతువులు ఉన్నాయి.

సంతానోత్పత్తికి అనువైన సమయం..
నల్లమలలో వన్యప్రాణుల సంతతిని పెంచేందుకు గాను 2018 నుంచి ప్రతి ఏటా వానాకాలంలో పర్యాటకుల కదలికలు లేకుండా అటవీ శాఖ ఆంక్షలు విధిస్తోంది. వన్యప్రాణులు ఏడాదంతా జతకట్టినా.. పెద్దపులి జతకట్టు సమయం మాత్రం ఇదే. ఆడపులుల గర్భాదారణ సమయం 16 వారాలు అయితే.. ఆడపులి గర్భాదారణ సమయంలో ఉన్నట్లు వాటి మూత్ర విసర్జన గుర్తుల ఆధారంగా మగపులులు ఆకర్షించబడతాయి. సాధారణంగా ఒక ఈతలో 3–4 పులి పిల్లలకు జన్మనిస్తాయి. వీటిని దట్టమైన అటవీ ప్రాంతాలు లేదా రాతి పగుళ్లు, నెర్రెలు ప్రాంతాల్లో పొదుగు చేసుకుంటాయి. ఆడపులి జీవిత కాలంలో సుమారుగా సమాన సంఖ్యలో ఆడ, మగ పిల్లలకు జన్మనిస్తుంది. ఆడపులులు సంతానోత్పత్తికి సిద్ధమయ్యే కాలం 3–4 సంవత్సరాలు కాగా.. మగ పులులు కాస్త ఆలస్యంగా 4–5 సంవత్సరాల కాలంలో సంతానోత్పత్తికి సిద్ధమవుతాయి.

మూడు నెలల పాటు..
జూలై నుంచి సెప్టెంబర్ వరకు పులులు, ఎలుగుబంట్లు ఇతర జంతువుల సంతానోత్పత్తికి అనువైన రోజులు. ఈ సమయంలో వాటి ఏకాంతానికి ఎలాంటి భంగం కలగకూడదని నిషేధాజ్ఞలు విధించారు. మూడు నెలల పాటు అటవీ ప్రాంతంలోకి ఎవరిని అనుమతించరు. జంతువుల కదలికలను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తారు. అదేవిధంగా అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల్లో విస్తరించి ఉన్న నల్లమల ప్రాంతంలోని పలు పర్యాటక ప్రాంతాలతో పాటు అక్కమహాదేవి గుహలకు వెళ్లే అవకాశం ఉండదు.

మూడు నెలల పాటు..

జూలై నుంచి సెప్టెంబర్ వరకు పులులు, ఎలుగుబంట్ల ఇతర జంతువుల సంతానోత్పత్తికి అనువైన రోజులు. ఈ సమయంలో వాటి ఏకాంతానికి ఎలాంటి భంగం కలగకూడదని నిషేధాజ్ఞలు విధించారు. మూడు నెలల పాటు అటవీ ప్రాంతంలోకి ఎవరిని అనుమతించరు. జంతువుల కదలికలను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తారు. అదేవిధంగా అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల్లో విస్తరించి ఉన్న నల్లమల ప్రాంతంలోని పలు పర్యాటక ప్రాంతాలతో పాటు అక్కమహాదేవి గుహలకు వెళ్లే అవకాశం ఉండదు.

నిరంతర ప్రక్రియ..



నల్లమల అందాలను తిలకించే యాత్రికులు నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అనుమతులు లేకుండా అడవిలోకి ప్రవేశించడంపై ఆంక్షలు నిరంతరం కొనసాగే ప్రక్రియ. జూలై నుంచి సెప్టెంబర్ వరకు పెద్దపులి జతకట్టే రోజులు. దీంతో మూడు నెలలపాటు యాత్రికులను అనుమతించడం లేదు. ఫర్హాబాద్ వ్యూపాయింట్ సఫారీ సేవలు నిలిపివేశాం. పర్యాటకులు అటవీశాఖ అధికారులకు సహకరించాలి. ప్రధాన రహదారి గుండా వాహనదారులు 30 కి.మీ. వేగం మించకుండా వెళ్లాలి.

– రోహిత్ గోపిడి, డీఎఫ్‌ఓ

క్లుప్తంగా

గాయపడిన ఉపాధి కూలీ మృతి


తులసి(ఫైల్)

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన గాయపడిన ఉపాధి కూలీ తులసి(60) ఆదివారం మృతి చెందింది. తండా వాసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాలుగు రోజుల కిందట తండాలో నిర్వహిస్తున్న ఉపాధి పనులకు ఆమె వెళ్లింది. తోటి కూలీలతో కలిసి పనులు చేస్తుండగా.. అకస్మాతుగా సొమ్మసిల్లి కింద పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. గాయపడిన ఆమెను హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. శనివారం తండాకు తీసుకురాగా.. ఆదివారం మృత్యువాత పడింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. దీంతో తండాలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

పరిహారం అందించాలి..

ఉపాధి పనులకు వెళ్లి గాయపడి మృతిచెందిన ఉపాధి కూలీ తులసి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా పరిహారం అందించి ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు. మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన గిరిజన సంఘం ఆధ్వర్యంలో తండాను సందర్శించి మృతదేహానికి నివాళి అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉపాధి పనులు చేస్తూ.. ఎంతో మంది కూలీలు మృత్యువాత పడుతున్నా.. ప్రభుత్వాలు ఆయా కుటుంబాలను ఆదుకోవడంలేదన్నారు. ప్రభుత్వం పరిహారం అందించకుంటే గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాంతమ్మ, గిరిజన సంఘం నాయకులు బాలునాయక్, సింగిల్ విండో డైరెక్టర్ బిల్యానాయక్, చిట్టెమ్మ, కృష్ణనాయక్ పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..

బిజినేపల్లి: మండలంలోని పాలెంలో శనివారం ఉదయం చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం వట్టెం గ్రామానికి చెందిన రాములు పాలెం మత్స్యకారులకు తోడుగా పెంటోని చెరువులో చేపల వేటకు వెళ్లాడు. వల వేస్తూ చెరువులో దిగిన రాములుకు ప్రమాదశావత్తు వల చిక్కుకుని నీటిలో పడిపోయాడు. స్థానిక మత్స్యకారులు గమనించి రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. శనివారం రాత్రి మృతదేహం లభ్యమైంది. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం


శాంసన్ (ఫైల్)

శాంతినగర్: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంజనేయులు, సుశీలమ్మ దంపతులకు రెండవ కుమారుడైన శాంసన్ (23) హైదరాబాద్‌లో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో బయటకు వెళ్లిన సమయంలో లారీ ఢీకొని రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

ప్రమాదవశాత్తు కార్మికుడు..


ఆంజనేయులు (ఫైల్)

శాంతినగర్: పొట్టకూటి కోసం హైదరాబాద్‌కు వెళ్లిన ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే మండలంలోని రామాపురం చెందిన ఆంజనేయులు (28) రెండు నెలల క్రితం హైదరాబాద్‌కు బతుకుదెరువు కోసం వెళ్లాడు. భవన నిర్మాణ పనుల్లో కూలీ పనికి వెళ్లేవాడు. గురువారం రాత్రి భవనం ఎక్కే సమయంలో పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం చూసిన తోటి కార్మికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం రామాపురంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిరుపేద అయిన ఆంజనేయులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సంపులో పడి వృద్ధుడి..

తెలకపల్లి: వృద్ధుడు సంపు గుంతలో పడి మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని గడ్డంపల్లికి చెందిన పర్వతాలు(75) ప్రమాదవశాత్తు సంపు గుంతలో పడి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలియజేశారు.

18 పొట్టేళ్లు చోరీ

ఆత్మకూర్: పొలంలో ఉన్న 18 కొండ పొట్టేళ్లను ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని మొట్లంపల్లి శివారులో రైతు మణివర్ధన్‌రెడ్డి తోటలో కొండ పొట్టేళ్లను పెంచుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున 18 పొట్టేళ్లను ఎత్తుకెళ్లారని.. వీటి విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని వివరించారు. అలాగే ప్రధాన ఎడమకాల్వ వద్ద గొల్ల బండలన్న వ్యవసాయ పొలంలోని రెండు పొట్టేళ్లను దొంగలు ఎత్తుకెళ్లారు.

సమష్టిగా ఆడి విజేతగా నిలిచారు



సమష్టిగా ఆడడంతో టీ–20 లీగ్‌లో భారత జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో మన జట్టు బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుతమైన ఆటతీరును కనబరిచారు. ఈ విజయం మా లాంటి యువ క్రికెటర్లకు స్ఫూర్తి దాయకం.

– అబ్దుల్ రాఫె, క్రికెటర్

ఆటతీరు అమోఘం



భారత జట్టు వరుస విజయాలు నమోదు చేసుకుంటూ ఫైనల్ మ్యాచ్‌లో కూడా అద్వితీయమైన ప్రతిభతో ఛాంపియన్‌గా నిలవడం అమోఘం. ఫైనల్‌లో ఒత్తిడిని జయించి విజేతగా నిలిచి దేశంలోని అందని మన్ననలు పొందారు.

– ఎండీ.అద్నానుద్దీన్, క్రికెటర్

17 ఏళ్ల తర్వాత..



17 ఏళ్ల తర్వాత భారత జట్టు ఛాంపియన్‌గా నిలిచినందుకు సంతోషంగా ఉంది. ఓడిపోతామనే మ్యాచ్‌ను మన క్రీడాకారులు సమష్టిగా ఆడి విజేతగా నిలిచారు. టీ–20 ఫైనల్ మ్యాచ్ క్రికెట్ చరిత్రలో నిలిచిపోతుంది.

– డేవిడ్ క్రిపాల్, క్రికెటర్

ఆనందంగా ఉంది



రెండోసారి టీ–20 ప్రపంచకప్‌ను భారత జట్టు సాధించడం ఆనందంగా ఉంది. మొదటి మ్యాచ్ నుంచి మన జట్టు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అంశాల్లో చక్కటి ప్రదర్శన ఇచ్చారు. ఉత్కంఠంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా జట్టు చాంపియన్‌గా నిలవడం మరిచిపోలేని అనుభూతి.

– మనోజ్, క్రికెటర్

ఐదు ఓవర్లలో మ్యాచ్ మారిపోయింది



ఫైనల్‌లో చివరి ఐదు ఓవర్లు పూర్తిగా మ్యాచ్‌నే మార్చేసింది. బుమ్రా, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్ చక్కటి బౌలింగ్ చేసి సౌతాఫ్రికా జట్టును కట్టడి చేశారు. సూర్యకుమార్ యాదవ్ పట్టిన క్యాచ్ భారత జట్టు ఛాంపియన్‌గా నిలపడంలో కీలకంగా మారింది. భారత జట్టు టీ–20 చాంపియన్‌గా నిలవడం సంతోషంగా ఉంది.

– కొండ శ్రీకాంత్, క్రికెటర్

జగజ్జేతకు జయహో..

- టీ–20 ప్రపంచకప్ విజయోత్సవ సంబరాలు
- రోహిత్ సేన విజయంపై ప్రశంసలు
- ఔత్సాహిక క్రికెటర్లలో ఉత్సాహం నింపిన గెలుపు

పొట్టి క్రికెట్‌లో టీమిండియా ప్రపంచ చాంపియన్‌గా నిలవడంతో క్రికెట్ అభిమానులు విజయోత్సవ సంబరాలు మిన్నంటాయి. శనివారం అర్ధరాత్రి నుంచే అభిమానులు హోరెత్తించారు. ఆదివారం ఊరు, వాడల్లో త్రివర్ణ పతాకాలతో ర్యాలీలు నిర్వహించారు. టపాసులు కాల్చడంతో పాటు ఉల్లాసంగా.. ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఈ విజయం ఔత్సాహిక క్రికెటర్లకు ఎంతో స్ఫూర్తినిస్తుందని.. జగజ్జేతగా నిలిచిన రోహిత్‌సేనకు జయహో అంటూ క్రికెట్ ప్రేమికులు పేర్కొన్నారు.


మహబూబ్‌నగర్‌లో కేక్‌కట్ చేస్తున్న ఎండీసీఏ ప్రతినిధులు, యువ క్రీడాకారులు



మహబూబ్‌నగర్ క్రీడలు: టీ–20 ప్రపంచకప్ చాంపియన్‌గా ఇండియా జట్టు సాధించిన విజయం దేశంలోని యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రం పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్ మైదానంలో ఆదివారం భారతజట్టు గెలుపుపై ఎండీసీఏ ఆధ్వర్యంలో క్రీడాకారులు సంబరాలు చేసుకున్నారు. పటాసులు కాల్చడంతో పాటు కేక్‌కట్ చేశారు. జాతీయ జెండాలతో స్టేడియంలో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 ఏళ్ల తర్వాత భారత జట్టు ప్రపంచకప్‌ను సాధించిందన్నారు. ఈ విజయం ఔత్సాహిక క్రికెట్ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపిందన్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి తమ ఆటతీరుతో యువ క్రికెటర్లలో జోష్ నింపారని తెలిపారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల వరకు క్రికెట్ క్రేజ్ పెరిగిందని, ఈ విజయంతో మరింత మంది యువత క్రికెట్‌పై ఆసక్తి కనబరుస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శులు వెంకటరామారావు, సురేష్‌కుమార్, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: భారతజట్టు అద్భుత విజయం సాధించడంపై ఆదివారం పట్టణంలోని మైదానంలో సంబరాలు నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. కార్యక్రమంలో వాకర్స్, క్రీడాకారులు, పీఈటీలు పాల్గొన్నారు.



జడ్చర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్

భారత జట్టుకు అభినందనలు



చాంపియన్‌గా నిలిచిన భారత జట్టుకు అభినందనలు. ఈ లీగ్‌లో ఓటమి చవి చూడకుండా వరుస విజయాలు నమోదు చేసుకుంటూ ఫైనల్ మ్యాచ్‌లో మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవడం సంతోషంగా ఉంది. ఇండియా జట్టు స్ఫూర్తితో యువ క్రికెటర్లు చక్కటి ప్రదర్శన కనబరచాలి. క్రికెట్‌లో నిరంతరం ప్రాక్టీస్ చేస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.

– అబ్దుల్లా బిన్ అహ్మద్, క్రికెట్ కోచ్, ఎండీసీఏ

మిడ్జిల్: మండల కేంద్రంలో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులు సంబరాలు చేశారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు నిస్సార్, రాంబాబు, వరుణ్, మల్లేష్, కృష్ణ, ఇమ్రాన్, బాలు, నాని, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


మిడ్జిల్‌లో కేక్ కట్ చేస్తున్న యువకులు

అవినీతి మరకలు..!

- కల్వకుర్తి డివిజన్‌లోని పలు శాఖల అధికారులపై ఆరోపణలు
- వరుసగా ఏసీబీకి పట్టుబడినా మారని తీరు
- అడ్డుకట్ట పడేదెన్నడో..?


2021లో ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ తహసీల్దార్ సైదులు (ఫైల్)



కల్వకుర్తి టౌన్: అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపట్టినా ఆశించిన ఫలితాలు రావడం లేదు. కొందరు అధికారులు, సిబ్బంది ప్రజల బలహీనతను ఆసరాగా చేసుకొని ప్రతి పనికి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఏసీబీ అధికారులు దాడులు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నా.. మార్పు రావడం లేదు.

డివిజన్ పరిధిలో..

కల్వకుర్తి డివిజన్ పరిధిలో కల్వకుర్తి, వెల్దండ, వంగూర్, ఊర్కొండ, చారకొండ మండలాలు ఉన్నాయి. కల్వకుర్తి, వంగూర్, వెల్దండ మండలాల్లో పోస్టింగ్‌లకు చాలామంది అధికారులు, ఉద్యోగులు గట్టి ప్రయత్నాలు చేస్తుంటారు. ఆయా మండలాల్లో ఇసుక, రేషన్ బియ్యం, మట్టి రవాణా వంటి అక్రమాలు దందాలు జోరుగా సాగుతుండటమే కారణం. ఇలాంటి ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తే చేతినిండా సంపాదించుకోవచ్చని చాలామంది తమదైన శైలిలో ప్రయత్నాలు చేసి మరీ బదిలీపై వస్తుంటారు.

ఈ శాఖల్లోనే ఎక్కువగా..

ప్రభుత్వంలో ప్రధాన శాఖలైన రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మైనింగ్, రిజిస్ట్రేషన్ శాఖల్లోనే అవినీతి రాజ్యమేలుతోందనే చెప్పాలి. ఇటీవల కల్వకుర్తిలోని ఓ రైస్ మిల్లులో రేషన్ బియ్యం ఆటో అధికారులకు పట్టుబడగా.. రైస్‌మిల్లర్‌ను కేసు నుంచి తప్పించేందుకు రోడ్డుపై పట్టుకున్నట్లు సృష్టించి రూ.2 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. అదేవిధంగా విద్యుత్ తీగలను మార్చేందుకు మండలానికి చెందిన ఓ ప్రధాన అధికారి డబ్బులు డిమాండ్ చేయగా.. చేసేదేమీ లేక ముట్టజెప్పాడని ఆ శాఖలోని అధికారులే చర్చించుకుంటున్నారు. కల్వకుర్తి పురపాలికలో ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సహకారంతో కార్యాలయంలోని ప్రధాన విభాగాల అధికారులంతా అవినీతికి పాల్పడుతున్నారని బహిరంగంగానే వినిపిస్తోంది. భవన నిర్మాణ అనుమతులు, వెంచర్ల ఏర్పాటులో పెద్దమొత్తంలో దండుకుంటున్నట్లు సమాచారం. వెల్దండ ఎస్‌ఐ రవి ఏసీబీకి పట్టుబడిన సమయంలోనూ మండల కేంద్రంలోని ఓ విలేకరి పాత్రపై కూడా ఆరా తీసినట్లు తెలుస్తోంది.

అవినీతికి అడ్డే లేదు..



మండల కేంద్రంలో మేము సాగు చేసే భూమి బైసర్వే నంబర్‌తో వేరొకరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మా పొలంలో విత్తనాలు వేస్తుండగా ఎస్‌ఐ రవి వచ్చి బెదిరించాడు. ట్రాక్టర్‌ను తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఉంచడంతో పాటు నాపై కేసు నమోదు చేశారు. ట్రాక్టర్ ఇవ్వడానికి, కేసు ఎత్తివేయడానికి రూ.2 లక్షలు డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని చెబితే అసభ్య పదజాలంతో దూషించారు.

– ప్రవీణ్, ఎస్‌ఐ రవి బాధితుడు, వెల్దండ

డివిజన్ పరిధిలో ఏసీబీకి పట్టుబడినవారు..

- 2016లో కల్వకుర్తి సబ్‌రిజిస్ట్రార్ సతీష్‌కుమార్ ఓ రిజిస్ట్రేషన్ విషయంలో డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్నారు.
- 2016లో కల్వకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించిన రామారావు పంజుగుల గ్రామ భూమి మ్యుటేషన్‌కు రూ.10 వేలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.
- 2016, డిసెంబర్‌లో అప్పటి వెల్దండ ఎస్‌ఐ మురళీకృష్ణ, కానిస్టేబుల్ శ్యాంసుందర్ మండల కేంద్రంలో ఓ హోటల్ యజమాని దగ్గర రూ.5 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- 2018లో అప్పటి వీఆర్వో భీమయ్య మ్యుటేషన్ కోసం రైతు నుంచి రూ.5 వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- 2020లో ఇసుక ట్రాక్టర్ యజమానితో రూ.10 వేలు లంచం డిమాండ్ చేసిన కేసులో అప్పటి ఎస్‌ఐ రాజు పట్టుబడ్డారు.
- 2021, ఏప్రిల్‌లో కల్వకుర్తి విద్యుత్ ఏఈ సురేష్ డబ్బుల కోసం కాంట్రాక్టర్‌ను ఇబ్బందులకు గురిచేయడంతో ఏసీబీ అధికారులకు సమాచారమిచ్చి పట్టించాడు.
- 2021, ఏప్రిల్‌లో మైనింగ్ అనుమతుల కోసం అప్పటి వెల్దండ తహసీల్దార్ సైదులుకు మధ్యవర్తి అయిన వెంకటయ్య రూ.5 లక్షలు లంచం తీసుకున్నారు. వెంటనే ఏసీబీ అధికారులను చూసి వాటిలో కొన్నింటికి నిప్పంటించగా.. మరికొన్ని డ్రైనేజీలో పారబోశాడు.
- 2023, ఏప్రిల్‌లో చారకొండ తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం ఓ వ్యక్తి నుంచి రూ.75 వేలు లంచం తీసుకుంటూ తహసీల్దార్ నాగమణి, ధరణి ఆపరేటర్ రాజు, వీఆర్‌ఏ భర్త వెంకటయ్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.
- 2024, జనవరి 20న కల్వకుర్తి ఆర్డీఓ కార్యాలయంలో సర్వేయర్ వాస్యానాయక్ సర్వే రిపోర్టు కోసం రూ.8 వేలు లంచం తీసుకుండగా పట్టుకున్నారు.
- 2024, జూన్‌లో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేయకుండా వెల్దండ ఎస్‌ఐ రవి రూ.50 వేలు తన వ్యక్తిగత డ్రైవర్ విక్రమ్ ద్వారా తీసుకోగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

వైభవంగా కంచికామకోటి పీఠం బ్రహ్మోత్సవాలు


ఆలయంలో గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం కంచికామకోటి పీఠం పాలమూరుశాఖ 32వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా శివాలయంలో గణపతిపూజ, పుణ్యహవాచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన కార్యక్రమాలతో పాటు వేంకటేశ్వరస్వామి ఆలయంలో అంకురార్పణ, అగ్నిమథనం, నవగ్రహ పూజలు, నందివాహన సేవ నిర్వహించారు. జూలై 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని వెంకటేశ్వర సేవామండలి అధ్యక్షుడు తోటపల్లి శ్రీకాంత్ శర్మ, ప్రధాన కార్యదర్శి గొండ్యాల రాఘవేంద్ర శర్మ తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని శివాలయంలో సుప్రభాత సేవ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుప్రభాత సేవ, యాగశాలలో అవాహిత దేవతా పూజలు, వేదపారాయణం, లక్ష్మీగణపతి, గరుడ, సుబ్రహ్మణ్య, నవగ్రహ, మూలమంత్ర అనుష్ఠానాదులు, చండీ పారాయణ, శ్రీసూక్త, పురుషసూక్త, సుందరకాండ పారాయణం, ఏకాదశ రుద్రాభిషేకాలు తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 7వ తేదీ సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో సి.రాజేశ్వర్, సుదర్శన్‌గౌడ్, వెంకట్రాములుగౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ, నందకిషోర్, ఆకారపు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకుదెరువుకు వెళ్లి మృత్యుఒడిలోకి...

గోపాల్‌పేట: మండల కేంద్రానికి చెందిన ఐలమోని లక్ష్మయ్య(57) బతుకు దెరువుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని, ప్రకాశం జిల్లాకు వెళ్లి అక్కడ మృత్యువాత పడ్డాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన ఐలమోని లక్ష్మయ్య, తన బామ్మర్ది కుర్మయ్యతో కలిసి సుమారు 42 రోజుల కిందట ఆంధ్రప్రదేశ్‌లోని, ప్రకాశం జిల్లా, దర్శి మండలంలో వంట పనులు చేసేందుకు వెళ్లాడు. లక్ష్మయ్యకు గోపాల్‌పేటలో కల్లు తాగే అలవాటు ఉండేది. అక్కడికి వెళ్లి రెండు రోజులు కల్లు తాగకుండా ఉండేసరికి వింతగా ప్రవర్తించాడు. రెండు రోజుల తర్వాత మూడో రోజు అక్కడ కనిపించకుండా పోయాడు. తన బామ్మర్ది ఎంత వెతికినా దొరకకపోవడంతో దర్శి పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదు చేయించారు. ఆదివారం ఉదయం దర్శి మండల కేంద్రానికి సమీపంలోని ఓ పొలంలో మృతదేహం ఉండటం గమనించి, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు లక్ష్మయ్య బామ్మర్ది కుర్మయ్యను పిలిపించగా.. దుస్తులు చూసి మృతదేహం తన బావదేనని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అక్కడ పోస్టుమార్టం అయిన వెంటనే మృతదేహాన్ని ఇంటికి తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

కొనుగోలు చేసిన మొదటిరోజే ఆవులు మృత్యువాత


వస్పులలో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన రెండు ఆవులు

మిడ్జిల్: మండల పరిధిలోని వస్పులకి చెందిన తెలుగు శ్రీశైలానికి చెందిన రెండు ఆవులు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు కథనం ప్రకారం.. వస్పులకి చెందిన రైతు శ్రీశైలం శనివారం కావేరమ్మపేట సంతలో రూ.1.30లక్షలకు రెండు ఆవులను కొనుగోలు చేసి వ్యవసాయ పొలం వద్ద కట్టేసి వచ్చాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూసేసరికి రెండు ఆవులు తాడు తెంపుకొని దగ్గరలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై మృతిచెంది పడిఉన్నాయి. కొనుగోలు చేసిన ఒక రోజుకే రెండు ఆవులు మృతి చెందడంతో బాధిత రైతు దిగాలు చెందాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

కుక్కల దాడిలో పొట్టేళ్లు మృతి

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని శిశుమందిర్ కాలనీలో నివాసం ఉంటున్న ఖాజాకు చెందిన ఆరు పొట్టేళ్లపై కుక్కలు దాడి చేయడంతో మృతిచెందాయి. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో గొర్రెలను కట్టేయగా.. కుక్కలు దాడి చేయడంతో ఆరు పొట్టేళ్ల అక్కడికక్కడే మృతిచెందాయని బోరున విలపించాడు. కాలనీలో కొంత కాలంగా కుక్కలు స్వైర్యవిహారం చేస్తూ.. చిన్నపిల్లలపై దాడి చేస్తున్నాయని, పాలకవర్గానికి, అధికారులకు విన్నవించినా.. పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు. పొట్టేళ్ల మృతిచెందడంతో తనకు రూ.80వేల వరకు ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

పేకాట రాయుళ్లపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారులోని అలంపూర్ చౌరస్తాలో పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారితో ఉన్న రూ.24,560 నగదును పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. కర్నూల్‌కు చెందిన ఆరుగురుని, తెలంగాణకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలియజేశారు.

కురుమూర్తి సన్నిధిలో స్పెషల్ సీఎస్


శశాంక్ గోయెల్‌కు ఆశీర్వచనం అందిస్తున్న అర్చకులు

చిన్నచింతకుంట: అమ్మాపూర్ సమీపంలో కొలువుదీరిన కురుమూర్తి స్వామిని ఆదివారం ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ డైరెక్టర్ జనరల్ అండ్ స్పెషల్ సీఎస్ శశాంక్ గోయెల్ దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శాలువాతో సత్కరించి, ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మధనేశ్వర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

టీమిండియాకు వైఎస్ జగన్ అభినందనలు



సాక్షి, అమరావతి: టీ20 ప్రపంచకప్ గెల్చుకున్న టీం ఇండియాకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. 'టీ20 ప్రపంచకప్‌లో చరిత్రాత్మక విజయం సాధించిన టీం ఇండియాకు అభినందనలు. మీ పట్టుదల, కృషి ఫలించాయి. ఇది ప్రతీ భారతీయుడు గర్వించదగ్గ క్షణం. జైహింద్' అని ట్వీట్ చేశారు.

మూడు వారాల్లో 7 వేల కోట్ల అప్పులా?

- సంపద సృష్టించడం అంటే ఇదేనా చంద్రబాబూ?
- వైఎస్సార్ సీపీ జాతీయ అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి ధ్వజం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలన అంతా అప్పులమయమని విమర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు వారాల్లోనే రూ.7 వేల కోట్ల అప్పు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ జాతీయ అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు చెబుతున్నట్లుగా సంపద సృష్టించడం అంటే అప్పులు చేయడమేనా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి మంగళవారం అప్పు లేనిదే గడవని పరిస్థితి నెలకొందని వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు ఇప్పుడు ఆయన చేస్తున్నదేంటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పేదలకు రూ.2.70 లక్షల కోట్లు డీబీటీతో నేరుగా అందచేసి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించిన విషయాన్ని గుర్తు చేశారు. రవిచంద్రారెడ్డి ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఒక్క పథకం అమలు చేయడానికే రూ.7 వేల కోట్లు అప్పు చేసిన చంద్రబాబు మిగతా హామీలను నెరవేర్చాలంటే ఇంకెన్ని కోట్లు అప్పు చేయాల్సి ఉంటుందో రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై విచ్చలవిడిగా దాడులకు తెగబడుతున్నా సీఎం చంద్రబాబు ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఆయన ప్రోద్బలంతోనే దాడులు జరుగుతున్నట్లు భావించాల్సి వస్తోందన్నారు. దివంగత వైఎస్సార్ విగ్రహాన్ని కాల్చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. తోపుడు బండికి బ్లూ రంగు ఉందనే అక్కసుతో చిరు వ్యాపారిపై దాడి చేయడం అత్యంత హేయమన్నారు. సీఎం చంద్రబాబు ఈ దురాగతాలకు అడ్డుకట్ట వేయకుంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

పిల్లలపై పిడుగు!

ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలకు ఎసరు

- అప్పు చేసైనా కట్టి తీరాల్సిందేనని యాజమాన్యాల ఒత్తిడి
- షెడ్యూల్ ప్రకారం ఇవ్వాల్సిన రూ.1,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- 2023–24 హాస్టల్ ఖర్చులు, మెస్ చార్జీల కింద ఇవ్వాల్సిన మరో రూ.1,100 కోట్లకు మంగళం



సాక్షి, అమరావతి: 'మీరు.. పరీక్షలు రాయాలంటే ముందు ఫీజు కట్టండి. చివరి సంవత్సరం పాసైన వాళ్లకు సర్టిఫికెట్లు ఇవ్వాలంటే ఫీజులు మొత్తం చెల్లించాల్సిందే. మెస్, హాస్టల్ చార్జీలు కడితేనే గదులు కేటాయిస్తాం. ప్రభుత్వం ఇచ్చేవరకు చూద్దామంటే కుదరదు. కొత్త ప్రభుత్వం వచ్చింది. ఇక మీకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని ఆశ పడొద్దు. అప్పో.. సప్పో చేసి బకాయిలు తీర్చండి. లేదంటే మీ చదువులకు కచ్చితంగా ఆటంకాలు తప్పవు. ఆ తర్వాత మాది బాధ్యత కాదు...' ఇదీ ఏపీలో డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లొమా కాలేజీ యాజమాన్యాల బెదిరింపు ధోరణి! ''గత ఐదేళ్లు మా పిల్లల చదువులు సాఫీగా సాగిపోయాయి. ప్రతి మూడు నెలలకు ఒకసారి షెడ్యూల్ ప్రకారం జగనన్న విద్యా దీవెన కింద ఫీజులతోపాటు ఏడాదికి హాస్టల్, మెస్ ఖర్చులు వసతి దీవెనతో మా ఖాతాల్లో పడేవి. వెంటనే మేం కళాశాలలకు చెల్లించేవాళ్లం. మా పిల్లలకు సరిగా చదువు చెప్పకున్నా, హాస్టల్ బాగోలేకున్నా గట్టిగా ప్రశ్నించేవాళ్లం. ఇప్పుడు పరిస్థితులు చూస్తుంటే మళ్లీ అప్పులు చేసి పిల్లలను చదివించుకోవాల్సిన దుస్థితి తప్పదని భయమేస్తోంది''తల్లిదండ్రులు ఆవేదన ఇది!

పేర్లు మార్చడంలో ఉన్న ఉత్సాహం అమలులో ఏది?

రాష్ట్రంలో ఐదేళ్ల పాటు నిశ్చింతగా ఉన్న ఉన్నత విద్యా రంగంలో ఒక్కసారిగా కుదుపు మొదలైంది. ఇన్నాళ్లూ ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో చదువుల్లో రాణిస్తున్న పేదింటి బిడ్డల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి ఖర్చులు కలిపి మొత్తం రూ.2,400 కోట్లు బకాయిలు ఇంతవరకు విడుదల కాకపోవడంతో పిల్లల చదువుల పరిస్థితి గాలిలో దీపంలా మారింది. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఫీజుల బకాయిలు విడుదల కాకపోవడం, కోర్సులు పూర్తి చేసిన వారి చేతికి సర్టిఫికెట్లు అందకపోవడంతో ఆదుర్దా చెందుతున్నారు. ఏ కళాశాలలో చూసినా ఫీజుల గోలే వినిపిస్తోంది. ఇంతకాలం ప్రతి మూడు నెలలకు ఒకసారి (త్రైమాసికం) విడుదల చేస్తున్న ట్యూషన్ ఫీజుల చెల్లింపులు నిలిచిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మరోవైపు ఇంటికి దూరంగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంతో(వసతి దీవెన) హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులపై ఒక్కసారిగా అప్పు భారం పడింది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ హయాంలో అమలైన పథకాలకు పేర్లు మార్చిందే కానీ వాటి అమలు ఊసే విస్మరించింది. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ (ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్)గా మార్పు చేసింది. షెడ్యూల్ ప్రకారం ప్రతి త్రైమాసికానికి సంబంధించి విడుదల చేయాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్–మెస్ చార్జీల విషయాన్ని మాత్రం గాలికొదిలేసింది. నిర్ణీత షెడ్యూళ్ల ప్రకారం ఇవ్వాల్సిన ట్యూషన్ ఫీజు రూ.1,300 కోట్లు, హాస్టల్–మెస్ చార్జీల కింద ఏడాది చివరిలో ఇవ్వాల్సిన మరో రూ.1,100 కోట్లు కలిపి మొత్తం రూ.2,400 కోట్లు ప్రభుత్వం నుంచి అందకపోవడంతో లక్షలాది మంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

విద్యార్థుల్లో 'ఫీజుల'కలవరం

ప్రతి పేదింటి విద్యార్థికి ఉన్నత స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేశారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల ఖాతాల్లోనే నేరుగా ఫీజుల మొత్తాన్ని జమ చేసే విధానాన్ని తెచ్చారు. ప్రతి త్రైమాసికానికి ముందే షెడ్యూల్ ప్రకటించి నిధులు విడుదల చేశారు. 2023–24 విద్యా సంవత్సరంలో అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి 9.44 లక్షల మంది విద్యార్థులకు రూ.708.68 కోట్లను మార్చిలోనే గత ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో చెల్లింపుల ప్రక్రియ నిలిచిపోయింది. పోలింగ్ తర్వాత అనుమతి లభించగా కొంత మంది ఖాతాల్లో నగదు జమైంది. ఇంతలో కూటమి అధికారంలోకి రావడంతో హఠాత్తుగా చెల్లింపులు నిలిపివేశారు.

చదువులపై బాధ్యత లేదా?

పేదింటి విద్యార్థులను అత్యున్నత ప్రమాణాలు కలిగిన కళాశాలల్లో చదివించి వారి భవిష్యత్తుకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఉజ్వల బాటలు వేసింది. చదువుల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించింది. 2017 నుంచి 2019 మధ్య అధికారంలో ఉండగా టీడీపీ ప్రభుత్వం 16.73 లక్షల మంది విద్యార్థులకు రూ.1,778 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టింది. ఆ మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తూ బాధ్యతను మరిచి వ్యవహరిస్తోంది. 2023–24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇవ్వాల్సిన మొత్తాన్ని ఎగ్గొట్టేందుకు ప్రణాళిక వేస్తున్నట్టు తెలుస్తోంది.

చెల్లింపులపై దుష్ప్రచారం..

వైఎస్సార్ సీపీ హయాంలో 29.65 లక్షల మంది విద్యార్థులకు రూ.12,609.68 కోట్లు జగనన్న విద్యాదీవెన కింద ట్యూషన్ ఫీజులు చెల్లించారు. ఎన్నికలకు ముందు షెడ్యూల్ ఇచ్చి మరీ నిధులు విడుదల చేసినా తల్లిదండ్రుల ఖాతాల్లో జమ కాకుండా నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కుట్రలు చేసింది. విద్యార్థులకు అన్యాయం జరగకూడదని వైఎస్ జగన్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించడంతో నిధుల విడుదలకు ఒక రోజు సమయం (పోలింగ్‌కు ముందు) ఇచ్చింది. దీనిపైనా మరోసారి టీడీపీ మద్దతుదారులు కోర్టుకు వెళ్లడంతో కేసు విచారణ జరిగేలోపే ఆ ఒక్కరోజు సమయం కాస్తా గడిచిపోయింది. ఫలితంగా ఈ చెల్లింపులు నిలిచిపోయాయి. అనంతరం కొంత మంది ఖాతాల్లో మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ జమైంది. మిగిలిన మొత్తంతో పాటు జూన్‌లో ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన మొత్తాన్ని చెల్లించే విషయంపై కూటమి ప్రభుత్వం ఇంతవరకూ ఒక్క ప్రకటన కూడా చేయలేదు. కొత్త ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించకపోగా గత ప్రభుత్వంపై నెపం వేసే యత్నం చేస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.1,300 కోట్లు, వసతి దీవెనతో రూ.1,100 కోట్లు చెల్లించకుండా దుష్ప్రచారం చేస్తూ ఎగ్గొట్టేలా వ్యవహరిస్తోంది.

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా..

విద్యాసంస్థ	కోర్సు	ఫీజు
ట్రిపుల్ ఐటీ శ్రీసిటీ	బీటెక్(ఈసీఈ)	రూ.3,05,000
దామోదరం సంజీవయ్య లా వర్సిటీ	ఎల్ఎల్‌బీ(5ఏళ్లు)	రూ.2,45,900
ఎస్వీ అగ్రికల్చర్ కాలేజ్ తిరుపతి	ఎంబీఏ(అగ్రి బిజినెస్)	రూ.1,96,460
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్	ఎంబీఏ	రూ.1,83,650
ఏఎన్‌యూ	ఎంఎస్సీ(ఫోరెన్సిక్ కెమిస్ట్రీ)	రూ.1,80,750
శ్రీ కృష్ణదేవరాయ కాలేజీ	బీఎస్సీ(హార్టికల్చర్)	రూ.1,73,090
ఏయూ ఫార్మాస్యూటికల్స్ సైన్స్	ఎంఫార్మా(స్పెషల్)	రూ.1,58,500
చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్	ఫార్మా–డీ	రూ.1,25,000

నేను జగన్‌ను కలవలేదు

- ఆ కథనాలు, వార్తలన్నీ అబద్ధం
- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



సాక్షి బెంగళూరు: ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాను కలవలేదని, తాను భేటీ అయినట్లు వస్తున్న వార్తలను నమ్మవద్దని కేపీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. కొద్ది రోజులుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరులోని తన నివాసంలో ఉంటున్నారు. ఈ క్రమంలో డీకే శివకుమార్‌ను వైఎస్ జగన్ కలిశారని, పలు రాజకీయ అంశాలపై చర్చించారని వదంతులు వ్యాపించాయి. డీకే శివకుమార్‌ను వైఎస్ జగన్ కలిసి పుష్పగుచ్ఛం అందించినట్లు మార్ఫింగ్ ఫొటోలు కూడా ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి డీకే శివకుమార్ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా స్పందించారు. తాను ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయినట్లు కొందరు నకిలీ ఫొటో సృష్టించి ప్రచారం చేస్తున్నారని, తాను ఆయన్ను కలవలేదని చెప్పారు. ఆ కథనాలు, వార్తలన్నీ అబద్ధం అని చెప్పారు. ఇలాంటి వార్తలను నమ్మొద్దని ప్రజలను కోరారు.

పేట్రేగిపోతున్న టీడీపీ



హోంమంత్రి నియోజకవర్గంలోని కోటవురట్లలో మహిళలపై దాడి చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా కొనసాగుతున్న దాడులు

- ఆస్తుల విధ్వంసాలు, శిలాఫలకాల తొలగింపు, వైఎస్సార్ విగ్రహాల ధ్వంసం
- పుంగనూరుకు వెళ్లకూడదంటూ పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిలపై ఆంక్షలు
- టీడీపీ తరఫున వకాల్తా పుచ్చుకుని అడ్డుకున్న పోలీసులు
- హోం మంత్రి సొంత నియోజకవర్గంలో ఇద్దరు మహిళల దుస్తులు చించేసి దాడి
- ఆళ్లగడ్డలో పోలీస్‌స్టేషన్ సాక్షిగా రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు
- సీఐ ఎదుటే ప్రేమికుడిని చితకబాదిన వైనం
- కక్ష సాధింపుతో చూసీచూడనట్లున్న సీఎం చంద్రబాబు.. రాష్ట్రంలో రావణ కాష్టం రగిలించడమే టీడీపీ ఉద్దేశం


మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పౌరాణిక కళాకారుడు వేమారెడ్డి మృతి



మదనాపురం: మండలంలోని దుప్పల్లికి చెందిన పౌరాణిక కళాకారుడు కోట్ల వేమారెడ్డి (65) ఆదివారం మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కళాకారుడు కోట్ల వేమారెడ్డి దేశ, విదేశాల్లో పౌరాణిక నాటక ప్రదర్శనలు ఇచ్చారు. రాష్ట్రంలో దాదాపు వెయ్యి ప్రదర్శనలు ఇచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం మొదలుకొని తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ పౌరాణిక నాటకాలు జరిగినా అక్కడ వేమారెడ్డి ఉంటారు. అలాగే ఉత్తమ రైతుగా అవార్డులు అందుకున్నారు. ఆయన మృతిపై భజనపరులు, పౌరాణిక నాటక కళాకారులు, రాష్ట్ర నాటకీయ కళామండలి సభ్యులు సంతాపం వ్యక్తంచేశారు.

జూరాలకు ఇన్‌ఫ్లో నిల్



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం ప్రాజెక్టుకు ఎలాంటి ఇన్‌ఫ్లోలు లేదు. ఆవిరిరూపంలో 133, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్టు–2కు 844, సమాంతర కాల్వకు 800 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 1,342 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 7.817 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రామన్‌పాడుకు 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం నిలకడగా ఉంది. జూరాల సమాంతర కాల్వ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఆదివారం నాటికి 1,019 అడుగుల నీటిమట్టానికి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. లిఫ్టుల ద్వారా 844 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వదులుతున్నారు.

ఆది నుంచి వివాదాస్పదమే!

జడ్చర్ల పురపాలికలో అవినీతి ఆరోపణలు

- చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికే మొగ్గు
- ఏకమైన అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు
- సొంత పార్టీ నుంచే కుంపటి



కలెక్టరేట్ ఎదుట అవిశ్వాస లేఖతో జడ్చర్ల కౌన్సిలర్లు (ఫైల్)

జడ్చర్ల: స్థానిక పుర పాలకమండలి ఏర్పాటైన కొన్నాళ్లకే ప్రజల విశ్వాసం కోల్పోయింది. కౌన్సిలర్ నుంచి మొదలు చైర్‌పర్సన్ వరకు అంతా అవినీతికి అంబాసిడర్లుగా మారారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఇక ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు అవినీతి, అక్రమాలపై ఆందోళనలు చేపట్టడం.. ప్లాట్లు కోల్పోయిన బాధితులు అధికారులు, పోలీసులు, పాలకుల చుట్టూ తిరిగినా న్యాయం జరగని పరిస్థితి కళ్లముందే జరిగిపోయింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ నుంచి పోటీచేసి గెలిచిన అనిరుధ్‌రెడ్డికి పాలకమండలి పనితీరు ప్రధాన అస్త్రంగా మారిందంటే అతిశయోక్తి కాదు. అంతేగాక పాలకమండలి వ్యవహారశైలి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తీవ్ర ప్రభావం చూపి బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఓటమికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు.

మాజీ ఎమ్మెల్యే బుజ్జగింపులతో..

జడ్చర్లలో మొదటిసారి కొలువుదీరిన పాలకమండలి పనితీరు ఆది నుంచి వివాదాస్పదంగానే ఉంది. చైర్‌పర్సన్ పనితీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ప్రజల అభీష్టం మేరకు కౌన్సిలర్లు కూడా అవిశ్వాసం వైపు తలొగ్గాల్సి వచ్చింది. కనీసం చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దింపేందుకు తమవంతు కృషిచేసి కొంత మేలు చేశామన్న భావన ప్రజల్లో తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఇన్నాళ్లూ సొంతపార్టీ కౌన్సిలర్లను బుజ్జగిస్తూ వచ్చారు. చివరకు తమపై ప్రజల్లో రోజురోజుకు నమ్మకం సన్నగిల్లుతుండటం, ఎవరో ఒకరు చేసిన తప్పులకు అందరు కౌన్సిలర్లపై అవినీతి ఆరోపణలు వస్తుండటం, వాటిని తిప్పికొట్టి తమ పక్షాన చైర్‌పర్సన్ నిలబడే పరిస్థితి లేకపోవడంతో చివరకు అవిశ్వాసానికి సిద్ధమయ్యారు.

సొంత పార్టీ నుంచే కుంపటి..

మున్సిపాలిటీలో మొత్తం 27 మంది సభ్యులుండగా.. బీఆర్ఎస్ నుంచి 23, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఇద్దరు గెలిచారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ఒకరు కాంగ్రెస్‌లో చేరినా బీఆర్ఎస్ బలమే ఎక్కువగా ఉంది. కానీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస ప్రతిపాదనకు పార్టీలకతీతంగా అంతా ఏకమవ్వడం విశేషం.

కొత్త చైర్‌పర్సన్ ఎవరు?

అవిశ్వాసం నెగ్గితే కొత్త చైర్‌పర్సన్ ఎవరన్న దానిపై ప్రజల్లో చర్చ కొనసాగుతోంది. బీసీ (మహిళ) రిజర్వ్ కావడంతో ఆరుగురు కౌన్సిలర్లు పదవి కోసం రంగంలో ఉన్నారు. పోటీ ఎక్కువగా ఉండటం, వారిలో ఏకాభిప్రాయం కుదరకపోవడం తదితర కారణాలతో అవిశ్వాసం వీగిపోవడం ఖాయమన్న ధీమాలో చైర్‌పర్సన్ లక్ష్మి ఉన్నారు.

సమన్వయ లోపమేనా?

పాలకమండలితో పాటు పుర అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పట్టణాభివృద్ధి, సమస్యల పరిష్కారంలో చైర్‌పర్సన్ లక్ష్మి విఫలమయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. పుర పాలనలో ఆమె భర్త రవీందర్ ప్రమేయం అధికమైందని.. అవినీతి, అక్రమాలకు ఆయనే బాధ్యుడని, బినామీలతో తతంగమంతా నడిపిస్తారని పలువురు బాధితులు చెబుతున్నారు. అంతేగాక మూడేళ్ల పాలనలో ఒక్క కౌన్సిలర్ విశ్వాసాన్ని కూడా పొందకపోవడం చైర్‌పర్సన్ పనితీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు. దీంతో విపక్ష, స్వపక్ష సభ్యులంతా ఏకమై అవిశ్వాసానికి సిద్ధమయ్యారు.

సిట్టింగ్ జడ్జితో విచారించాలి

- మొలచింతలపల్లిలో సీపీఎం బృందం పర్యటన



చెంచులతో సమావేశమైన సీపీఎం నాయకులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లి చెంచుగూడెంలో ఇటీవల చెంచు నాగన్న మృతి, చెంచు మహిళపై దాడి జరిగిన ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని సీపీఎం సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు చెంచు గూడెంను సందర్శించారు. అక్కడ చెంచులతో సమావేశమయ్యారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చెంచు మహిళ ఈశ్వరమ్మపై బండి వెంకటేశ్వర్లు అతని కుటుంబం చేసిన దాడి గురించి ఆరా తీశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు మాట్లాడుతూ.. చెంచుగూడెంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈశ్వరమ్మపై దాడి చేసిన వారిని ఇంకా పోలీసులు అదుపులోకి తీసుకోలేదని తెలిపారు. ఇప్పటి వరకు నలుగురినే రిమాండ్‌కు పంపారని, మిగితావారిని అధికార పార్టీ అండతో అరెస్టు చేయడం లేదన్నారు. గూడెంలో చెంచుల భూములు కారుచౌకగా కొనుగోలు చేసిన వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు, శివవర్మ, సలీం, సురేందర్, కిరణ్, బాలపీరు, రాజు, హనుమంతు, తారాసింగ్, కిరణ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నుంచి ఈశ్వరమ్మ డిశ్చార్జ్

చెంచు మహిళ ఈశ్వరమ్మ ఆదివారం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో కోలుకుని డిశ్చార్జ్ అయ్యింది. కుటుంబసభ్యులు ఆమెను గ్రామానికి తీసుకొచ్చారు. మంత్రి సీతక్క బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి సోమవారం వస్తున్నట్లు సమాచారం.

బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

నారాయణపేట: ఎమ్మెల్సీ పదవీ కాలం పూర్తయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ వదిలి వెళ్లనని.. వెళ్లాల్సి వస్తే పదవికి రాజీనామా చేస్తానని ఉమ్మడి పాలమూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం జిల్లాకేంద్రం సమీపంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీని మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటే జీవితంలో స్థిరపడేంత డబ్బుతో పాటు ఓ చైర్మన్ పదవి ఇస్తామని కాంగ్రెస్‌పార్టీ ఆశజూపిందని.. మాజీ సీఎం కేసీఆర్ నన్ను నమ్మి టికెట్ ఇచ్చారని, 12 మంది మాజీ ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్యేలు భరోసానివ్వడంతో ఏం ఆలోచించకుండా రంగంలోకి దిగి విజయం సాధించానన్నారు. నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసేంత వరకు సమయం వచ్చినప్పుడల్లా సమస్యను లేవనెత్తుతామని చెప్పారు. నారాయణపేట జిల్లాను రద్దు చేస్తే ఊరుకునేది లేదని.. ఉద్యమం చేస్తామన్నారు.

ఆరునెలల్లోనే అరాచకాలు..

కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అరాచకాలు మొదలయ్యాయని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి గెలుపునకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ నేతలు అధికార మదంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థిని పోటీకి నిలబెట్టడంతో ఎన్నికలు జరిగాయన్నారు. రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేసేందుకు ముందుకొచ్చిన నవీన్‌రెడ్డి మనోధైర్యాన్ని మెచ్చుకోవాలని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా జిల్లాకు సాగునీరు అందేందుకు, జిల్లాను రద్దు చేస్తారనే ప్రచారంపై చట్టసభల్లో ప్రస్తావించాలన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సురేఖ, పేట ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కన్నా జగదీశ్, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి, ప్రజాప్రజాప్రతినిధులు

హిందూ సంస్కృతిని చాటాలి

అడ్డాకుల: ప్రతిఒక్కరూ హిందూ సంస్కృతిని చాటేలా ముందుకు సాగాలని అంభాత్రయ క్షేత్రం పీఠాధిపతి శ్రీఆదిత్య పరాశ్రీ స్వామిజీ పిలుపునిచ్చారు. మండలంలోని కందూర్‌లో వెలిసిన శ్రీకృష్ణమాంభ ఆలయం వద్ద అమ్మవారి ప్రియ శిష్యుడు, ప్రముఖ వైద్యుడు గంగాధర్‌గౌడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 24వ ఆరాధన సహిత సప్తాహ మహోత్సవాల సందర్భంగా ఆదివారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో భక్తులనుద్దేశించి మాట్లాడారు. హరినామాస్మరణతోనే ముక్తి మార్గం లభిస్తుందన్నారు. పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలను చెబుతూ పెంచాలని సూచించారు. మూఢనమ్మకాలను వీడాలని, ఒకరికి సాయం చేసే విధంగా జీవనం సాగించాలని సూచించారు. ఇదిలా ఉండగా.. ఆలయం వద్ద అభిషేకం, హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఆలయం వద్ద రథోత్సవం నిర్వహించారు. ఆలయం ముందున్న రథాన్ని అందంగా అలంకరించారు. రథం ముందు కుంభం పోసి యజ్ఞం చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారం చిత్రపటం, పాదుకలను రథం వద్దకు తీసుకొచ్చి రథంపై అలంకరించారు. అనంతరం రథాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆలయం వద్ద నిత్య అన్నదానం కార్యక్రమం కొనసాగుతోంది. అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.



కందూర్‌లోని కృష్ణమాంభ ఆలయంలో శ్రీఆదిత్య పరాశ్రీ స్వామీజీ

గంగాపురం ఆశ్రమాన్ని సందర్శించిన స్వామీజీ

జడ్చర్ల టౌన్: గంగాపూర్ మళయాల స్వామి ఆశ్రమాన్ని పిజ్వారం అంబాత్రేయ క్షేత్రం ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వామి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మళయాళ స్వామి పీఠాధిపతి పరమాత్మ నందగిరి వెంకటస్వామి వారికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.